అంతరంగం (భేతాళకథ)

— బేతనపల్లి బోస్, Fairlawn, NJ

భేతాళుడు మనకు తెలుసుగదా! విక్రమార్కుడు — శవం — శవంలో భేతాళుడు... కథ... ----

భూషయ్య రామయ్య చిన్ననాటి స్నేహితులు. ఇరుగుపొరుగు. ఒకే బడిలో చదువు. కలిసి బడికి వెళ్ళడం, చదువుకోవడం, ఆడుకోవడం చేసే వారు. వీరి కుటుంబాల్లో దరిద్రం అనే విషాదం, చీకటి వున్నాయి.

వాళ్ళు యౌవనం కాలంలోపాటే. జీవితంలో ఎవరికైనా అవకాశం ఒక్కసారే వస్తుంది తలుపు తడుతుంది అన్నట్లు, ఎలాగో వచ్చిన అవకాశం జారిపోకుండా భూషయ్య పట్టుదలపట్టుకొని, గుమాస్తాగిరి మీద 'గల్లు' వెళ్ళిపోయాడు.

సంవత్సరాలు గడిచాయి. కాలం ఎన్నోమార్పులు తెచ్చింది. గల్లు యజమానికి కష్టమొచ్చినప్పుడే, తెలివిగా కొంత డబ్బు ఆదాచేసి, వున్నవూరికే తిరిగివచ్చాడు. భూషయ్య బ్రతుకుతెరువుకు ఇబ్బంది లేనట్లేగా చిన్నవ్యాపారం ప్రారంభించాడు. ఈ విధంగా రామయ్య, భూషయ్యల చిన్ననాటి స్నేహబంధం బలపడింది. పెద్దదిగా పెరిగింది.

కాలంతెచ్చిన మార్పుల్లో, రామయ్య సంసారంలో నలుగురు పిల్లలు, ముగ్గురు తల్లిదండ్రులు కలుపుకొని ఎనిమిదిమంది వున్నారు. రామయ్యభార్య పత్తెకాలపు పత్తెపు బిళ్ళ అనే ఆభరణం పుట్టింటినుండి తెచ్చుకున్న బంగారం. ఉదయమంతా సాయంత్రంవరకూ అష్టావధానం శతావధానం చేసేవాళ్ళకు ఏమీ తీపిపోకుండా పనులు చేసుకుంటూ, గుట్టుగా సంసారం చేసుకొనే మనిషి. రామయ్యకు ఆవిడ కొండంత అండ. మానసికంగా ఎంతో శాంతిస్తుంది.

భూషయ్య సంసారంలో ఇద్దరు పిల్లలు రాజా, రమణి. భార్య సూరమ్మతో ఎలాంటి సూరమ్మది వేరే తత్వం. కట్టూబొట్టూలలో ఒక ప్రత్యేకత. మాటల్లో చేతల్లో ఖచ్చితంగావుండే మనిషి. ఏమాత్రం తేడాను భరించలేదు. రాక్షసం, రౌద్రబాటు స్వభావం అసలేలేదు. దైవభక్తి మెండు. వెంకటేశ్వరస్వామిదయవల్లే చాలామందికంటే వాళ్ళజీవితం ఎంతో బాగుపడ్డ మనిషి అనేమనిషి. పూజలు పునస్కారాలు నోములు మొక్కులు వ్రతాల్లో లోపంవుండదు. అలా జరగనీదుకూడాను. ఒక సారి అమ్మాయి రాజాకు విషజ్వరంవచ్చి చావుబ్రతుకులసమస్య అయినప్పుడు, వెంకటేశ్వరస్వామి నిలువుదోపిడి ఇస్తానని మ్రొక్కుకొని, రాజా ఆరోగ్యం కుదుటపడ్డ తరువాత మాటప్రకారం స్వామికి దాదాపు లక్షరూపాయలు ఖర్చుచేసి మరీ అర్చించడం జరిగింది.

కష్టపడి సంపాదించిన డబ్బు ఈవిధంగా నిలువుదోపిడీకావడం భూషయ్యకు అంత బాధాకరం అయితే సూరమ్మకు అది స్వల్పవిషయం. సూరమ్మకు బిడ్డమీదవున్న ప్రేమకు, భూషయ్య అబ్బురపడ్డాడేగాని పైకి ఏమీ అనలేదు. నిలువుదోపిడితో భూషయ్య నిక్షేపనిధిమాత్రం తగ్గింది. పరవాలేదు అనుకొన్న జీవితం, వెలుగునుండి చిన్నప్పటి చీకటిజీవితంవైపు కాస్త జారింది. అది భూషయ్యకు మాత్రమే తెలుసు. బ్రతుకుభయం భూషయ్యలో ప్రవేశించి ప్రశాంతతను కొల్లగొట్టింది.

రామయ్యభూషయ్యలిద్దరూ కష్టజీవులే. కష్టాలవల్లేవారు మరీ మంచి దోస్తులయ్యారేమో! రామయ్య సంపాదన అంతంత మాత్రంగా వుండి, తిండికి ఇబ్బందిలేదనిపిస్తుంటే, ప్రస్తుతం భూషయ్య రామయ్యకంటే ఒక్కమెట్టుపైన మాత్రమే వున్నాడు.

భూషయ్య కూతురు రమణి ఎప్పటికప్పుడు సిక్కు అవుతూనేవుంటుంది. మొదట్లో కాస్త స్వస్థత కనిపించినా క్రమేపి ఆరోగ్యం క్షీణించడం జరిగింది. సూరమ్మ రమణి ఆరోగ్యం గురించి పూజలు వ్రతాలు చేస్తూనేవుంది. ఫలితంమాత్రం ఏమాత్రం కనిపించడంలేదు. రమణి ఆరోగ్యం కుదుటపడాలని పెద్దమొత్తం ముడుపుగట్టి వెంకటేశ్వరస్వామికి మ్రొక్కుకుంది. డాక్టరు మాత్రం గ్యారంటీ ఇవ్వడంలేదు. కానీ దేవుడిమీది విశ్వాసంతో మంచిరోజుకోసం సూరమ్మ ఎదురుచూస్తుంది.

రామయ్య పిల్లల్లో రమ్య, రఘు పెద్దవాళ్ళు. మంచిమార్కులతో ఇంటరుపాస్ అయి కాలేజీచదువులకు వచ్చారు. డబ్బువున్న పిల్లలకు కాలేజీలో సీట్లు దొరక్క బాధపడుతూంటే, బాగా చదువుకొనే రమ్య రఘులను కాలేజీలకు పంపేస్తోమత లేదని రామయ్య కుమిలిపోతున్నాడు. ఇదంతా భూషయ్య గమనిస్తూనేవున్నాడు. పెద్దచదువులు, వెనుక ఆస్తులు లేక రామయ్యగాని, తనుగాని జీవితంలో ఎంత కష్టపడుతున్నదీ, అనుభవపూర్వకంగానే తెలుస్తుంది. చదివే తెలివితేటలువున్న ఆడ మగపిల్లల తెలివి వృధాకారాదని నమ్మేమనిషి భూషయ్య. రామయ్యను ఆదుకొనేందుకు నిర్ణయించుకొన్నాడు. భరోసాకూడా యిచ్చాడు.

అనుకొన్నట్లుగానే రామయ్యపిల్లలకు కాలేజీలో సీట్లురావడం జరిగింది. రమణి ఆరోగ్యం గురించి సూరమ్మ ముడుపుగట్టి వుంచిన డబ్బు సూరమ్మతో సంప్రదించకుండానే రామయ్య చేతిలో పెట్టాడు.

ఇది జరిగిన కొద్దిరోజులకే రమణి ఆరోగ్యం కుదుటబడింది.కానీ సూరమ్మ బిడ్డల్ని తీసుకొని భూషయ్యను వదిలివెళ్ళిపోయింది.

కథ అయ్యింది.

అసలే అర్ధరాత్రి. చీకటి, స్మశానం, పురుగు, పుట్రా, నక్కలు, తోడేళ్ళు, భుజంమీదశవం బరువు, దారి సరిగ్గావుండకపోవడం, చాలాసేపు కత్తిపట్టుకునివుండడంవల్ల చెయ్యినొప్పి బాధల్లో, విక్రముడు కథ సక్రమం గావిన్నాడో లేదో అని భేతాళుడికే కాదు మనకు కూడా డౌట్‌రావడం సహజమే. అయినా రూల్ ప్రకారం భేతాళుడు ప్రశ్నలు వెయ్యవలసిందే.

ప్రశ్న 1. రమణిజబ్బు నయమయింది. మ్రొక్కు ఒకసారికాకపోతే ఇంకోసారి తీర్చుకోవచ్చునని తెలిసికూడా సూరమ్మ భూషయ్యను ఎందుకు వదలిపెట్టి వెళ్ళిపోయింది.?

ప్రశ్న 2. మ్రొక్కుకోసంవుంచిన డబ్బు అని తెలిసికూడా భూషయ్య అదే డబ్బును రామయ్యకు ఎందుకు ఇచ్చేశాడు?

ప్రశ్న 3. భూషయ్య ఒంటరిగా బ్రతికే పరిస్థితి ఎందుకువచ్చింది?

అందుకు విక్రమార్కుడు జవాబులు ఈవిధంగా చెప్పాడు.

1. సూరమ్మకు తనేమిటో పూర్తిగాతెలుసు.' బిడ్డ ఆరోగ్యంకంటే దేవుడికంటే భార్యమాటకంటే భూషయ్యకు స్నేహం ముఖ్యం అయింద'న్న ద్వంద్వవైఖరిని సహించలేకపోవడం ఒకకారణం. రెండవకారణం దేవునిమీద వున్న అమితమైన భక్తి. మ్రొక్కు వెంటనే తీర్చలేకపోవడం సూరమ్మతత్వం లోనేలేదు. అందుకే భూషయ్యను వదిలివెళ్ళింది.

2. భూషయ్య కష్టంతో పైకివచ్చినవాడు. ప్రాణం తరువాత డబ్బునే అధికంగా ప్రేమించింది. మొదటిసారి రాజా ఆరోగ్యం నిమిత్తం నిలువుదోపిడి ఇచ్చినప్పుడు అంతమొత్తం పోయిందని షాకు అయ్యాడేగానీ భార్యను ఏమీఅనలేదు. బిడ్డమీద తనకు ప్రేమలేదు అనేదానికికూడా లేదు. రెండవసారి సూరమ్మ మ్రొక్కుకున్నప్పుడు — డబ్బు ఎలాగూ తనదగ్గర వుండదు. రెండు — రమణి ఆరోగ్యం బాగుపడుతుందన్న గ్యారంటీ లేదు. మిత్రుడికి డబ్బు అవసరం. దానిని ఆసరాగాతీసుకొని సహాయంచేసే మిషతో రామయ్యకు ఆడబ్బు యిచ్చి సూరమ్మభక్తివుద్రేకపు వాగ్దానాలమీద సూరమ్మ వ్యక్తిత్వంమీద దెబ్బకొట్టాలన్నదే భూషయ్య అంతరంగవాంఛ.

3. సూరమ్మ పరిస్థితులనుబట్టి రాజీపడి తనతో వుంటుందనుకొన్నాడు గానీ, రాజీపడే మనస్తత్వంలేని సూరమ్మమాత్రం భూషయ్యను ఒంటరివాణ్ణి చేసిపోయింది.

విక్రమార్కుడు హుషారుగా జవాబులు చెప్పేశాడు. దాంతో మౌనభంగంకావడం, భేతాళుడు శవంతోసహా చెట్టుమీదనున్న తన స్వీటుహోమ్‌కి చెక్కేయడం, విక్రముడు నిద్రలేమిచేత నీరసంగా కాళ్ళీడ్చుకొంటూ ఇంటికివెళ్ళిపోవడం, శుక్లపక్షపు తదియచంద్రుడు ఆకాశంవదలి మీ పెదవులమీద ఉదయించడం క్షణాల్లో జరిగిపోతాయి.